నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
సోమవారం | 23 డిసెంబరు 2024 పేజీలు 8

## శ్రీశైల క్షేత్ర పరిధిలో

# అన్యమత కార్యకలాపాలు నిషేధం


శ్రీశైల దేవస్థానం ఈవో శ్రీనివాసరావు

- శ్రీశైల దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** దేవదాయ శాఖ నిబంధనలను అనుసరించి శ్రీశైల క్షేత్ర పరిధిలో అన్యమత ప్రచారం,అన్యమతాలకు సంబంధించిన కార్యకలాపాలు, అన్యమత చిహ్నాలు ప్రదర్శించడం మొదలైనవాటిని పూర్తిగా నిషేధించడం జరిగిందని ఈవో ఎం. శ్రీనివాసరావు తెలిపారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ..అన్యమత సూక్తులను,చిహ్నాలను,బోధనలను, అన్యమతానికి సంబంధించిన ఫోటోలను కలిగివున్న వాహనాలు కూడా క్షేత్ర పరిధిలోకి అనుమతించబడవు అన్నారు. క్షేత్ర పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా గానీ అన్యమత ప్రచారాలకు, అన్యమత కార్యక్రమాలకు

మిగతా 2లో


రంగు మారిన మిర్చి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గత నాలుగు రోజులుగా బంగాళగాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా శుక్ర, శని, ఆదివారంలలో జిల్లా పశ్చిమ ప్రాంతంలో ముసురుకు కమ్ముకుంది. దీంతో మిరప రైతు విలవిల లాడుతున్నాడు చేతికి అందే మిరప పంట దెబ్బతింటుంది.దీంతోరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం పూట ఎక్కువ మంచు కురుస్తుండటంతో పొలాల్లో ఆరవేసుకున్న మిరప పంట తడిసి పోతుంది. టార్పాలిన్‌తో కప్పి అరబెట్టు కుంటున్నారు.అయితే మిరప మంచుకు తడవడంతో రంగు మారి పోతుంది.

మిగతా 2లో

- మిరప రైతు విల విల

## మిరప రైతులను “ముసురు”

# ముంచుతోంది


గోనెగండ్లలో తడిసిన మిరప పంటను ఆరబెట్టుకున్న దృశ్యం

**కోసిగి మేజర్ న్యూస్:** లక్షలాది రూపాయలు అప్పుచేసుకొని మూడునెలలపాటు పంటను సాగుచేసుకొని చేతికొచ్చిన పంట తమ కళ్ళెదుటే వర్షానికి తడిచి ముద్దవుతున్న దృశ్యాన్ని చూసి అన్నదాత కంట్లో మిర్చిమంటతో బాధపడుతున్న సంఘటన కోసిగి మండలంలో చోటుచేసుకుంది. కోసిగి మండలంలో వేలాది ఎకరాల్లో బోరుబావులు, గొట్టపుబావులు, కాలువల కింద మిరప, పత్తి, వరి వంటి పంటలను సాగుచేసుకోవడం జరిగింది. ఈ సాగుకు లక్షల్లో అప్పు తీసుకొని పంటలను సాగుచేసుకున్నారు. పంటలు దాదాపుగా మంచి దిగుబడి వచ్చి అమ్మకానికి తీసుకెళ్ళే సమయంలో ఆదివారం తెల్లవారుజామున వర్షం ఒక్కసారిగా రావడంతో కోసిగి గ్రామానికి చెందిన చాకలి ఎల్లప్ప మిరప పంట పూర్తిగా తడిసి ముద్దయ్యింది. ఆ రైతుతో పాటు మరి కొంతమంది రైతులు పంటలు కూడా పత్తి,

మిగతా 2లో

## అన్నదాత కంట్లో

# మిరప మంట

- అకాల వర్షం-అపార నష్టం
- తడిసి ముద్దైన మిరప
- అప్పులు కట్టలేక ఆత్మహత్యలే శరణ్యమంటున్న అన్నదాతలు


వర్షానికి తడిసిపోయిన మిర్చిని చూపిస్తున్న రైతు యల్లప్ప

## అజ్మీర్ దర్గా ఉరుసుకు వెళ్లే భక్తులకు

# ప్రత్యేక రైలు

- నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పార్లమెంట్‌లోని ముస్లింలకు రైల్వేశాఖ నంద్యాల జిల్లాలోని డోన్, కర్నూలు రైల్వే

మిగతా 2లో



ఎంపీ బైరెడ్డి శబరి

## సమస్యలకు నిలయంగా

# కంభళదిన్నె ఎంపిపి (ఎస్సీ) పాఠశాల


పని చేయని వాటర్ ట్యాంకు దృశ్యం

- పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 88..హాజరు మాత్రం 40 మంది
- ఉపాధ్యాయులు మాత్రం ఇద్దరేనంటా..!
- నాడు..నేడు మనబడి పథకం కింద రూ.8 లక్షల నిధులు మంజూరు
- త్రాగునీటికి నోచుకోలేని విద్యార్థులు
- పనిచేయని మంచినీటి బోరు..నిరుపయోగంగా మారిన మిని వాటర్ ట్యాంక్
- ఇళ్ల నుండే త్రాగునీరు తెచ్చుకుంటున్న వైనం
- పాఠశాలకు ప్రహరీ గోడలు లేకపోవడంతో పాఠశాల ఆవరణలో పశుగ్రాసం

2లో


పాఠశాల ఆవరణంలో గడ్డివాములను ఉంచిన దృశ్యం

## రోడ్డు ప్రమాదంలో శ్రీశైల దేవస్థానం

# వైద్యశాల నర్సు మృతి

- ఆమె మృతి పట్ల పలువురు తీవ్ర దిగ్భ్రాంతి


మృతి చెందిన నర్సు మల్లికా (ఫైల్‌ఫోటో)

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** దోర్నాల సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీశైలం దేవస్థానం వైద్యశాలలో నర్సుగా విధులు

మిగతా 2లో

సూర్య
సోమవారం | 23 డిసెంబరు 2024

## క్షేత్ర పరిధిలో అన్యమత కార్యకలాపాలు నిషేధం

(మొదటి పేజి తరువాయి)

సహకరించడం కూడా చట్టం ప్రకారం శిక్షార్హమే అని నిబంధనలను ఉల్లంఘించి, విరుద్ధంగా ప్రవర్తించిన యెడల చట్టం ప్రకారం తగు చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మిరప రైతులను ముసురు ముంచుతోంది

(మొదటి పేజి తరువాయి)

దీంతో ధర పలకదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా ముసురు కమ్ముకోవడంతో మిరపపంటకు బూడిదతెలుగు సోకింది. పూత రాలిపోవడం, కాయ రాలిపోవడంతో పాటు కాయ రంగు మార్ పోతుంది. ఉన్నకాయలకు కూడా ధర పలకద ని రైతులు వాపోతున్నారు. మండలంలో దాదాపు 6000 ఎకరాల మేర మిరప పంటను సాగు చేశారు. మిరపకు గిట్టుబాటు ధర కూడా లభించడం లేదని రైతులు వాపోతున్నారు క్వింటం ధర కేవలం రూ.7000 నుంచి రూ.9000 లోపే పలుకుందని గిట్టు బాటు ధర కూడా లభించడం లేదని రైతులువాపోతున్నారు.ఈ సమయంలో ఈ ముసురు ముంచు తొందని వారు ఆవేదన చెందుతు న్నారు. బడేసా నాయుడు అనే రైతు రెండు ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాడు. పోలంలో ఆరబోసుకున్న మిరప పంట నాలుగు రోజులు గా పంట మంచుకు తడిసి పోయింది. రంగు కూడా మారింది. ఎకరంకు దాదాపు లక్ష రూపాయల మేర పెట్టుబడులు పెట్టి వంట పండిస్తే పంట చేతికి అందేసమయంలో ముసురు నష్టాల పాలు చేసిందని రైతు బడేసానాయుడు ఆవేదన వ్యక్తం చేశాడు ఏది ఏమైన ఈ ముసురు మిరప, కంది. వేర శనగ పంటలకు ఇబ్బందిగా మారించని రైతులు తెలుపుతున్నారు.

## అజ్మీర్ దర్గా ఉరుసుకు వెళ్లే భక్తులకు ప్రత్యేక రైలు

(మొదటి పేజి తరువాయి)

స్టేషన్ మీదుగా అజ్మీర్ ఉరుసు కోసం వెళ్లే భక్తులకు కేంద్ర రైల్వేశాఖ స్పెషల్ రైలు సౌకర్యం కల్పించిందని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి చెప్పారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే 07119/07120 తిరుపతి-మదార్ జంక్షన్-తిరుపతి రైలు నంద్యాల జిల్లాలోని డోన్ జంక్షన్ రైల్వే స్టేషన్ నుంచి 2-1-2025 మధ్యాహ్నం 1.50కు బయలుదేరి అజ్మీర్‌కు 4-1-2025 శనివారం రోజు ఉదయం 4గంటలకు చేరుకుంటుందని తెలిపారు. అజ్మీర్‌లోని ఉరుసు తదనంతరం మళ్లీ తిరుగుప్రయాణంలో 9-1-25 ఉదయం 4.30నిమిషాలకు అజ్మీర్ లో బయలుదేరి డోన్ జంక్షన్‌కు 10-1-25 మధ్యాహ్నం 2.35గంటలకు చేరుకుంటుందని, ఈ రైలు కర్నూలు, కాచిగూడ, నాగపూర్, భోపాల్ మార్గంలో అజ్మీర్‌కు వెళ్తుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు. ఇదే రైలు కర్నూలు మీదుగా వెళ్తుందని కాబట్టి నంద్యాల జిల్లా వాసులు కర్నూలు నుంచి కూడా ప్రయాణం చేయవచ్చునని నంద్యాల జిల్లా ముస్లింలు అజ్మీర్ ఉరుసుకు వెళ్లే భక్తులు ఈ ప్రత్యేక రైలును ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

## రోడ్డు ప్రమాదంలో శ్రీశైల దేవస్థానం వైద్యశాల నర్సు మృతి

(మొదటి పేజి తరువాయి)

నిర్వహిస్తున్న మల్లికా మృతి చెందింది.వారి సన్నిహితులు తెలిపిన వివరాల మేరకు..మల్లిక ఆమె భర్త దినాకర్,వారి కుమార్తెతో కలిసి కారులో కర్నూల్ వెళ్లి వస్తుండగా ఆత్మకూర్-దోర్నాల మార్గ మధ్యంలో ప్రమాదవశాత్తు టూరిస్ట్ బస్సును వారు ప్రయాణిస్తున్న కారు ఢీకొంది.ఈ ఘటనలో మల్లిక అక్కడికక్కడ మృతిచెందగా మిగతా ఇద్దరికీ ఎటువంటి గాయాలు కాలేదని పేర్కొన్నారు.పొగ మంచు ఎక్కువగా ఉండటంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు వారు తెలిపారు.కాగా శ్రీశైలంలోని కొత్తపేటలో నివాసం ఉండే మల్లిక మృతి వార్తను తెలుసుకున్న పలువురు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.వైద్యశాలలో అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ అంకిత భావంతో విధులు నిర్వహించేదని అలాంటి మంచి మనసున్న ఆమె మృతిని జీర్ణించుకోలేకపోతున్నామని తెలిపారు.

## చర్మవ్యాధి కుక్కలు బాబోయి కుక్కలు..



చర్మవ్యాధితో తిరుగుతున్న కుక్క

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** మండల కేంద్ర మైన గోనెగండ్లలోని కుక్కలకు చర్మవ్యాధి సోకడంతో గ్రామంలోని పలు కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చర్మవ్యాధి కుక్కలు బాబోయి కుక్కలు అం టు కాలనీ వాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.కాలనీలో దాదాపు 20 కుక్కలు వింత చర్మవాధితో బాధపడుతున్నాయని కుక్కలకు చర్మం మొత్తం ఊడిపోయి రక్త ం, చీము కారుతుందని కాలనీ వాసులు తెలుపుతున్నారు. ఒక కుక్కకు వచ్చిన రోగం మరో కుక్కకు అంటుకొని కాలనీ లోని కుక్కల కు అన్నిటికి అంటుకుంది ఈ వ్యాధి అంటు వ్యాధిగా మారి కాలనీ వాసులకు వస్తే ఇబ్బం దిగా ఉంటుందని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. కావున పంచాయతీ అధికా రులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుత ఉన్నారు.

## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎన్ఎండి ఫయాజ్

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల దేవనగర్‌లో క్రిస్మస్ ఆరాధన పేరుతో సెమీ క్రిస్మస్ వేడుకలు చిన్నారుల ఆటపాటలతో సందడిగా కొనసాగింది. కల్వరి కరుణ ప్రార్థన మందిరం వ్యవస్థాపకులు పాస్టర్ అనీల్ కుమార్ ఆహ్వానం మేరకు సెమీ క్రిస్మస్ వేడుకలకు టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ పవిత్రమైన యేసుక్రీస్తు జన్మదిన సంబరాల్లో భాగంగా సెమీ క్రిస్మస్ వేడుకల్లో మతాలకు అతీతంగా కాలనీవాసులు అందరూ పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఐక్యమత్యంతో ప్రజలు అన్ని పండుగలు జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ మన్నెం జానయ్య, భాస్కర్, ఖాజా మొహిద్దిన్, సురేష్, వెంకటేశ్వర్లు, ప్రకాష్, అల్తాఫ్, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత కంట్లో మిరప మంట

(మొదటి పేజి తరువాయి)

వరి,మిరప పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నదాతలు వాపోయారు. చాకలి యల్లప్ప, 2ఎకరాల పొలంలో మిరప పంటను దాదాపుగా 5లక్షలకుపైగా అప్పుచేసుకొని సాగుచేసుకోవడం జరిగిందన్నారు. పంటదిగుబడి వచ్చి పొలంలోనే మిర్చిని ఆరవేసి ఉంచగా ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి తడిసి ముద్దయ్యాయని బోరున విలపించారు. మర్చితోపాటు పత్తి, వరి పంటలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నదాతలు లబోదిబో మంటున్నారు. తడిసిన మిర్చిని మార్కెట్‌లోకి తీసుకెళితే తక్కువదరకి పలకడంతో చేసుకొన్న అప్పులు తీర్చడం ఎలా అని.. అన్నదాతలు గుండెలు బాదుకుంటున్నారు. ఇలా అకాల వర్షానికి దెబ్బతిన్న పంటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని లేకపోతే ఆత్మహ్యాత్యలే శరణ్యమంటున్నారు.



వర్షానికి తడిసి ముద్దయిన మిర్చి

## సమస్యలకు నిలయం కంభళదిన్నే ఎంపిపి (ఎస్సీ) పాఠశాల




**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల పరిధిలోని కంభళదిన్నే గ్రామంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ ప్రాథమిక (ఎస్సీ) పాఠశాల సమస్యలకు నిలయంగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. పాఠశాల నందు రోల్ విద్యార్థుల సంఖ్య 88 మంది ఉండగా విద్యార్థులు హాజరు సంఖ్య మాత్రం 40నుంచి 50 కంటే ఎక్కువ హజరు కావడం లేదంటున్నారు. అందులో ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమేపిల్లలకు విద్యాభోధన చేస్తున్నారు. అలాగే గత వైసిపి ప్రభుత్వం హయాంలో నాడు.. నేడు.. మనబడి పథకం కింద రూ.8లక్షలు నిధులు కేటాయించింది. ఇందులోరూ.6 లక్షల తో పాఠశాలకు లైట్లు, ఫ్యాన్ తదితర వంటి పనులు చేపట్టడం జరిగిందని ఇంకా మిగిలిన రూ.2లక్షల నిధులు ఉన్నాయని పాఠ శాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.పాఠశాలలో ఉన్న మంచి నీటి బోరు చెడిపోయి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ మర్మతులు నోచుకోలేదని విద్యార్థులు వారి తల్లిదండ్రులు అంటున్నారు. దీంతో పాఠశాలలో త్రాగునీటి వసతి లేకపోవడంతో విద్యార్థులకు త్రాగు నీరు లేక తమతమ ఇళ్ల వద్ద నుంచి వాటర్ బాటిల్‌లో నీరు తెచ్చు కొని తాగాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అలాగునే పాఠశాల చుట్టూ ప్రహరిగోడలు లేక పోవడంతో విషపురుగులు సంచరిస్తూన్నందున విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. పాఠశాల ఆవరణలో పిల్లలు ఆటలు ఆడుకోవలంటే ఖాళీ స్థలంలో పశుగ్రాసం వేయడం వలన క్రీడలు ఆడుకోలేక పోతున్నామని వారు అంటున్నారు. అలాగే మధ్యాహ్నం భోజనం కూడా సక్రమంగా లేకపోవడంతో కొంత మంది పిల్లలు తమఇళ్ళకు వెళ్ళి భోజనం చేసి పాఠశాలకు హాజరవుతారని పిల్లలు తల్లిదండ్రులు అంటున్నారు. పాఠశాలకు ప్రహారీ గోడ లేనందున పలువురు గ్రామస్తులు పాఠశాల ఆవరణంలో పశు గ్రాసాన్ని నిలుపుదల చేసుకుంటూ ఉండడం కొసమెరుపు..దీంతో గ్రామంలో పలువురు ఆది పాఠశాలనా..పశు పాకనా..అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా మండల విద్యాశాఖాధికారులు స్పం దించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కాలనీ వాసులు. విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

# యువతతోనే నవసమాజ నిర్మాణం

**ఎ.పి. హెూటల్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనిధి రఘువీర్**
**సేవతోనే సమాజాభివృద్ధి**
**ఘనంగా గ్రీన్ సొసైటీ దశమ వార్షికోత్సవం**






**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** దేశభవిత యువత చేతిలో ఉందని, సామాజిక స్పృహ,సేవాభావంతో యువత సమాజ పురోగతికి తోడ్ప డాలని గ్రీన్ సొసైటీ గౌరవాధ్యక్షులు, ఎ.పి.హెూటల్స్ అసోషియేష న్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనిధి రఘువీర్ పేర్కొన్నారు. ఆదివారం నం ద్యాల మూలమఠం నందలి భీమలింగేశ్వర స్వామి దేవస్థానం నం దు గ్రీన్ సొసైటీ దశమ వార్షికోత్సవాన్ని అధ్యక్షులు దండు వెంకటే శ్వర్లు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రఘు వీర్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు పర్యావరణం, సామాజికసేవ పై దృష్టి సారించాలన్నారు. దండు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నం ద్యాల పట్టణం, పరిసర గ్రామాల్లో దశాబ్దకాలంగా విద్యార్థుల్లో నైతి కవిలువలు, దేశభక్తిని పెంచే వివిధ పోటీలు నిర్వహిస్తూ పర్యా వరణ జాగృతిని పెంపొందిస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే విధంగా స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు వివిధ శుభకార్యాలలో ఉపయోగించుకోవడానికి తమ సంస్థ తరపున ఉచితంగా అంద జేస్తున్నామన్నారు. ముఖ్యఅతిథి రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ జయచంద్రా రెడ్డి మాట్లాడుతూ పట్టణాలు,నగరాలలో అనుకూలమైన ప్రదేశంలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలన్నారు. మిద్దెతోటల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. ఇంజనీర్ నీలకంఠేశ్వరరెడ్డి మాట్లాడుతూ తాను ఆస్ట్రేలియాలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తు న్నానని నంద్యాలలో గ్రీన్ సొసైటీ నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలు యువతకు స్ఫూర్తిదాయకంగా కొనసాగడం అభినందనీయమని కొనియాడారు. ప్రధానవక్త అష్టావధాని డా. గంగుల నాగరాజు మాట్లాడుతూ స్పష్టమైన లక్ష్యం, అకుంఠితదీక్షతో విద్యార్థుల్లో సేవా స్ఫూర్తిని నింపడంలో గ్రీన్ సొసైటీ క్రియాశీలకంగా ఉండటం శు భపరిణామమన్నారు. తెలుగు పండిట్ అన్నెం శ్రీనివాసరెడ్డి మాట్లా డుతూ గ్రీన్ సొసైటీ ద్వారా భాషా, సాంస్కృతిక సేవాకార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యదర్శి పోసా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు కేశవ, చెస్ మాస్టర్ రామసుబ్బారెడ్డి నేతృత్వంలో పదవ వార్షికోత్సవం సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులందజేశారు. ముఖ్యఅతిథులను, సంస్థ క్రియాశీలక సభ్యులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమా లు అందరిని అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయసంఘ నేతలు వీరబ్రహ్మం, శేషఫణి, తొట్టి వెంకటేశ్వర్లు, కన్నయ్య, డా.నీలంవెంకటేశ్వర్లు, సొసైటీ సభ్యులు డి.వి.సుబ్బయ్య, రంగనాథ్ ,సంతోష్,సాయినాథ్, కిరణ్, రామసుబ్బయ్య, పాల్గొన్నారు.

# ఇద్దరు అంధులకు వెలుగును నింపిన శేగు అనసూయమ్మ

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఆయూష్ యోగ సేవా సమితి నిత్య సాధకులు శేగు రామసుబ్బయ్య తల్లి శేగు అనసూయమ్మ ఆదివారం ఉదయం మృతి చెందారు. రామసుబ్బయ్య వెంటనే స్పందించి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కో ఆర్డినేటర్ ఆనంద్‌కు వెంటనే ఫోన్ చేసి మా తల్లి నేత్రాలను మేము దానం చేస్తామని తెలిపారు. ఆనంద్ వెంటనే స్పందించి రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరికి తెలిపి కర్నూలు నుంచి టెక్నీషియన్లు వచ్చి రెండు నేత్రాలను తీసుకుని హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి పంపడం జరిగింది. ఈసందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ యోగా సభ్యులు గత 20 సంవత్సరాలు నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఇప్పుడు ఆర్గాన్ డొనేషన్‌పై దృష్టిని పెట్టి ఇప్పటికి 14 మంది చేత నేత్రదానం చేయించి 28మంది అంధులకు వెలుగును ప్రసాదించే దిశగా పయనిస్తున్నందుకు ఆనంద్ వీరిని అభినందించారు. ప్రతి ఒక్కరు కూడా శేగు అనసూయమ్మ, వారి కుటుంబ సభ్యులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. శేగు రామసుబ్బయ్య మాట్లాడుతూ మా తండ్రి జీవించి ఉన్నప్పుడే నాకు చెప్పారని నేత్రాలను దానం చేయాలని తెలిపేవారన్నారు. ఈకార్యక్రమంలో సుబ్బయ్య, ప్రదీప్, వరుణ్, శివ, తదితరులు పాల్గొన్నారు.


శేగు రామసుబ్బయ్య తన తల్లి అనసూయమ్మ నేత్రాలను అందజేస్తున్న దృశ్యం

# విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిద్దాం..పూర్వ విద్యార్థుల సంఘం



**పాములపాడు,మేజర్ న్యూస్ :** పాములపాడు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు తమ వంతు కృషి చేద్దామని పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి చల్లా జయశంకర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఏఎన్ఆర్ జడ్పీహెచ్ స్కూల్ ఆ సంఘం అధ్యక్షుడు నాగేంద్ర చారి అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ సంఘం కోశాధికారి అచ్యుతరావు విద్యార్థులను ప్రోత్సహించేందుకు పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు వరుసగా రూ.15,000, రూ.10,000 రూ.5,000 చొప్పున సంఘం తరపున ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక పూర్వ విద్యార్థి సహకారం అందించాలని చెప్పారు. సంఘంలో సభ్యత్వం కోసం 365 రూపాయలు చెల్లించాలని కోరారు. నిబంధన ప్రకారం ఈ సంఘం కొనసాగుతుందని వివరించారు. ప్రభుత్వం అందించే పథకాలతో పాటు మన వంతుగా విద్యార్థుల కోసం ఉన్నత విద్యను అభ్యసించేందుకు సహకారం అందిద్దామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నీ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థుల్లో సుమారు పేద విద్యార్థులే ఉంటారనడంలోఎలాంటి అతిశయోక్తి లేదు. తల్లిదండ్రులు కూడా దాదాపుగా వ్యవసాయ కూలీలే అధికంగా ఉంటారు. కాబట్టి ప్రతి పూర్వ విద్యార్థి కూడా తమ వంతు బాధ్యతగా విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరారు. పదవ తరగతి వార్షిక పరీక్షలకు ముందు అన్ని సబ్జెక్టుల పైన ఒక పరీక్ష నిర్వహించి, వారికి బహుమతులు ఇచ్చి ప్రోత్సహిద్దామని తెలిపారు. సంఘాన్ని బలోపేతం చేసేందుకు ఈ పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు వెంకటేశ్వరరావు, దేవభూషణం, ఇస్మాయిల్, పుల్లయ్య, శ్రీనివాసులు, మౌలా హుస్సేన్, సాయి కృష్ణ, నాగ శేషన్న, తదితరులు పాల్గొన్నారు.

# 5వ రోజుకు చేరిన ట్రాక్టర్ లేబర్ మరియు గని యజమానుల నిరాహారదీక్షలు

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్:** బందార్లపల్లె చెక్ పోస్టు వద్ద గని యజమానులు మరియు ట్రాక్టర్ కూలీలు కలిసి రాయల్టీ ఫీజు తగ్గించాలని 5 రోజుల నుండి నిరసనలు తెల్పుతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని రోజు రోజుకు నిరసన ఉధృతం అవుతుందని అన్ని గ్రామాల నుండి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య, శివరామిరెడ్డి, పర్స, ఉదయ్ కుమార్, దామోదర్ రెడ్డి, పెద్ద శ్రీరంగయ్య, చిన్న శ్రీ రంగయ్య, వంశీ, శివ, నంద్యాల నారాయణ రెడ్డి, రామచంద్రా రెడ్డి, కళ్యాన్ రెడ్డి, పెద్ద వెంకటరెడ్డి,రామచంద్ర,శివ,సుబ్బరాయుడు, మహేష్,గురెడ్డి, రసూల్, ఆవుల మహేష్, మోహన్, బ్రమ్మానందం, చిన్న రాముడు, యంపాలకు శ్రీను, ఇంకా ఒక 200 మందికి పైగా కార్మికులు పాల్గొన్నారు.


నిరసన తెల్పుతున్న దృశ్యం

# మెగా మెడికల్ క్యాంపుకు విశేష స్పందన



మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న దృశ్యం

**శిరివెళ్ల, మేజర్‌న్యూస్ :** శిరివెళ్ల మండల పరిధిలోని గుంప్రమాన్‌దిన్నె మజారా గ్రామమైన రాజనగరం గ్రామంలో తానా అధ్యక్షులు శింగవరపు నిరంజన్ ఆధ్వర్యంలో బసవతారకం ఆసుపత్రి బృందంతో ఏర్పాటు చేసిన మోగా మెడికల్ క్యాంపుకు విశేష స్పందన లభించింది. ఈ మెగా మెడికల్ క్యాంపును ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేతుల మీదుగా ప్రారంభించారు. క్యాన్సర్‌కు సంబంధించిన మెడికల్ క్యాంపును ఈ ప్రాంతంలో మొట్ట మొదటిసారిగా ఏర్పాటు చేయడం జరిగిందని ఈ మెడికల్ క్యాంపుకు విశేష స్పందన లభించినట్లు తానా అధ్యక్షులు నిరంజన్, పుల్లయ్య చౌదరిలు పేర్కొన్నారు. ఈ కాలంలో చిన్న వయస్సులోనే మోకాళ్ల నొప్పులు, క్యాన్సర్, తదితర వ్యాధులు వస్తున్నాయని అన్నారు. క్యాన్సర్ లక్షణాలు ఉన్న వారికి హైదరాబాద్‌లోని బసవతారకం ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

# త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పూడిచెర్ల గ్రామంలోత్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక చింతలపల్లి కమిటీ సభ్యుల వారి ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారంచేశారు.త్రిమత ఏకైక గురువు,తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల వివరం తెలుసుకొనుట వలన మధ్యాత్మ ఆరాధన తో ధర్మముల స్థాపన జరుగుతుంది., అదే త్రైత సిద్ధాంతం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు.ఈ కార్యక్రమం లోత్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక- చింతలపల్లి కమిటీ అధ్యక్షుడు, సభ్యులు కె . వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి, కుమారాచారి, నాగమద్దిలేటి, సంజీవ, గిరిబాబు, మనోహర్, పార్ధసారథి, కృష్ణవేణమ్మ, నాగలచ్చుమ్మ, లక్ష్మి నారాయణమ్మ, రాణెమ్మ ,చందు, వెంకటరమణమ్మలు పాల్గొన్నారు.



## క్రైమ్ స్పాట్

# ముప్పై గొర్రెలు మృతి

**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామంలో ఆదివారం ముప్పై గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గొర్రెల యజమాని గొల్ల గోరంట్ల నుండి సమాచారం అందుకున్న పశు వైద్యాధికారి జి.రోనాల్డ్ రిచర్డ్స్ గ్రామానికి చేరుకుని మృతి చెందిన గొర్రెలను పరిశీలించి అందుకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. పోస్ట్ మార్టం నిర్వహించి గొర్రెల మృతి మందుల అలర్జీ, రియాక్షన్ అని నిర్ధారించారు. మృతి చెందిన గొర్రెల నుండి పేగు, పొట్ట కసురు వంటి నమూనాలను సేకరించి కర్నూల్ పశు వ్యాధి నిర్దారణ కేంద్రానికి పంపించడం జరిగిందని తెలిపారు. మిగిలిన గొర్రెలకు వైద్యం అందించారు. ఈయన వెంట కొత్తకోట, సంగాల పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# టూ టౌన్ పరిధిలో కార్డెన్ సెర్చ్

**– 13 మోటర్ సైకిళ్లు సీజ్**

**నంద్యాల క్రైం, మేజర్‌న్యూస్ :** నంద్యాల టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, క్యూఆర్‌టి సిబ్బంది బృందాలుగా ఏర్పడి విశ్వనగర్‌లో కార్డన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. విశ్వనగర్‌లోని రౌడీషీటర్లు, అనుమానితుల గృహాల్లో సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 13 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర నివారణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు కార్డన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


స్వాధీనం చేసుకున్న మోటర్ సైకిళ్లతో పోలీసులు

# సమ్మెకు పిలుపునిచ్చిన లారీ, ట్రాక్టర్ యజమానులు

**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** బేతంచెర్ల పట్టణంలోని నాపరాళ్ల పరిశ్రమలకు కావలసిన ముడి సరుకును బనగానపల్లె మండలంలోని పలుకురు, రామకృష్ణాపురం గ్రామాల పరిధిలోని నాపరయి క్వారీల నుండి నిత్యం ట్రాక్టర్లు లారీల ద్వారా సుమారు 300కు పైగా ట్రాక్టర్లు లారీలు సరఫరా చేస్తుంటాయి. అయితే గత గురువారం 19వ తేదీన బేతంచెర్ల రాయల్టీ అధికారులు రాయల్టీలు లేవని ట్రాక్టర్లను నిలిపివేయడంతో లారీల,ట్రాక్టర్ల యజమానులు కార్మికులు రోడ్డుపై నిరసన తెలియజేశారు. ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో బేతంచర్ల ఎస్సై రమేష్ బాబు సంఘటన స్థలానికి చేరుకొని యజమానులతో చర్చించినప్పటికీ ఫలితం లేకపోవడంతో జిల్లా మైనింగ్ శాఖ ఏడి రాజగోపాల్ తో చర్చించగా నాలుగు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని చెప్పగా యజమానులు నిరసనను విరమింప చేశారు. అయితే నాలుగు రోజులు సమయం గడిచినప్పటికి ఆన్ లైన్ లో క్వారీల యజమానులకు రాయల్టీలు రాకపోవడంతో లారీల ట్రాక్టర్లు యజమానులు పరిష్కారం కోసం సోమవారం నుండి సమ్మెకు పిలుపునిచ్చామని కావున ప్రతి ఒక్క యజమాని సమ్మెలో పాల్గొనాలని వారు కోరారు.

# గుళ్లదుర్తిలో కార్డెన్ సెర్చ్

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** మండలంలోని గుళ్లదుర్తి గ్రామంలో కోవెలకుంట్ల ఎస్సై మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కార్డన్ సర్చ్ నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు. గ్రామంలో అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించి ఎలాంటి మారణాయుధాలు లేనట్లు గుర్తించారు. సరైన పత్రాలు లేని 15 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో మట్కా, జూదం, నాటుసారా, తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎస్సై సూచించారు. అందరు కలసిమెలసి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రేవనూరు ఎస్సై భూపాలుడు, స్పెషల్ పార్టీ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.



సూర్య



## కాలుష్యం నివారణ కోసం యువత సైకిళ్లను వినియోగించాలి



సైకిళ్లు తొక్కుతున్న చిన్నారులు

**కర్నూలు స్పోర్ట్స్ మేజర్ న్యూస్:** కాలుష్య నివారణ కోసం యువత సైకిళ్లను వినియోగించాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కర్నూల్ సెంటర్ ఇన్చార్జి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్,కర్నూల్ సాయి సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో సైక్లోతన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ర్యాలీనీ కర్నూలు ఔట్ డోర్ స్టేడియం నుంచి యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గ సభ్యుడు,రాష్ట్ర యోగ సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశే ఖర్ మాట్లాడుతూ ఫిట్ ఇండియా లో భాగంగా ఆరోగ్యాన్ని పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు సైక్లింగ్ చేయాలని కోరారు. హ్యాండ్ బాల్ శిక్షకుడు జతిన్ సింగ్, టైక్వాండో శిక్షకులు కార్తికేయన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## రాగద్వేషాలకు అతీతంగా జీవిస్తే జీవితం సుఖమయం..

**డీఈవో శామ్యూల్ పాల్**




విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న దృశ్యం

**కర్నూలు, మేజర్ న్యూస్ :** రాగద్వేషాలకు అతీతంగా జీవనం సాగిస్తే జీవితం సుఖమయమవుతుందని డీఈవో శామ్యూల్ పాల్ అన్నారు. స్థానిక జిల్లా పి ఆర్టియు కార్యాలయంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు ఎన్ వి కృష్ణా రెడ్డి అధ్యక్షతన క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధి మూర్తి జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్ ప్రముఖ మెజిషియన్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ ప్రపంచ మానవాళి జీసస్క్రీస్తు ప్రవచించిన శాంతి సంతోషం సమాధనం తో జీవించాలని , ఈర్ష్య అసూయ లను వదిలి రాగ ద్వేషాల కు అతీతంగా జీవించాలని విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలని పేర్కొన్నారు.. డిఇఓ శామ్యూల్ పాల్ క్యాండిల్ లైట్ వెలిగించి కేక్ కట్ చేశారు. అనంతరం స్విమ్మింగ్ పోటీలో రాష్ట్ర స్థాయిలో పతకం సాధించిన చిన్నారి శృతి నీ డీఈఓ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ టి యు నాయకులు రవిప్రకాష్, రమణయ్య బాబూరావు మల్లయ్య, సుదర్శనం,బుగ్గన్న ,శ్రీనివాసరెడ్డి,మనికుమార్, శ్రీను నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను కలిసిన టీజీ నంద్యాల జిల్లా చైర్మెన్



ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ను మర్యాదపూర్వకంగా కలిసిన సంజీవ కుమార్ రెడ్డి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** సాగునీటి ఎన్నికల్లో తెలుగు గంగ నంద్యాల జిల్లా చైర్మన్గా ఎన్నికైన చెన్నారెడ్డి సంజీవ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆదివారం భూమా అఖిలప్రియను,భార్గవ్ రామ్ను, భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిలను కలిసి సంజీవ కుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చైర్మన్ సంజీవ్ కుమార్కి అభినందనలు తెలిపి రైతులందరికి అందుబాటులో ఉంటూ సాగునీరు అందించాలన్నారు.

## తప్పుడు పత్రాలతో తప్పుదోవ పట్టిస్తున్నవారిపై చర్యలు తీసుకోండి

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** కొందరూ తప్పుడు పత్రాలతో తప్పుదోవ పట్టిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ అబ్దుల్ వహీద్, జహంగీర్ బాషాలు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ శేషఫణి వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 106 సర్వే నంబర్ లో గల భూమి 265 ఎకరాలు రెవెన్యూ ఆన్లైన్ లో విస్తీర్ణం ఉందని, దీనికి సంబంధించిన 2021లో సర్వే చేసి సబ్ డివిజన్ కూడా చేశారన్నారు. ఈ భూమి హక్కుదారులు అల్లబీ, మస్తాన్ బి, అల్లా బకాష్ వీరు క్రయ, విక్రయాలు చేశారని తెలిపారు. తస్లీమా లేట్ రఫిక్ అనేవారు తమరికి అర్జీను అందించి పైతెలిపిన సర్వే నంబర్ లో 3.08 విస్తీర్ణం భూమి ఉంది అని తప్పుడు పత్రాలతో అధికారులకు తప్పుదోవ పట్టించి ఇబ్బందులకి గురి చేస్తున్నారని వారు తెలిపారు. సంబంధంలేని మధ్యవర్తులు తమ స్వార్థానికి అధికారులకు తప్పుదోవ పట్టించి తప్పుడు అర్జీలతో మాకు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పై తెలిపిన సర్వే నెంబర్ భూములలో ఉన్న అందరు హక్కుదారులను తమరు నోటీసులు జారీ చేసి అందరి సమక్షంలో సర్వే చేయాలని వారు కోరారు. ఇప్పటికైనా అధికారులు స్థల కొనుగోలుదారులను ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.



## ముగిసిన రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్ మేజర్ న్యూస్:** కర్నూలు జిల్లా నెట్ బాల సంఘం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా కర్నూలు అవుట్డోర్ స్టేడియం లో జరిగిన పదవ రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. బాలికల విభాగంలో వెస్ట్ గోదావరి జిల్లా జట్టు మొదటి స్థానంలో నిలువగా, రెండవ స్థానంలో విశాఖపట్నం జిల్లా జట్టు, మూడవ స్థానంలో కృష్ణా జిల్లా చెట్లు నిలిచాయని రాష్ట్ర కార్యదర్శి శివరాం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి విద్యావేత్త కెవి సుబ్బారెడ్డి, జిల్లా నెట్ బాల సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు బాబు ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులనుఅందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో రెండు రోజులు పాటు క్రీడాకారులు పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో జిల్లా నెట్ బాల్ సంఘం సభ్యులు నాగరత్నమయ్య,సూర్య తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి- ఎమ్మెల్యే బుడ్డా



బాధితులకు సిఎంఆర్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

**ఆత్మకూరు, మేజర్న్యూస్:** ఆరోగ్య సమస్యలు ఇబ్బందులు పడుతూ ఆర్థిక స్థోమతలేని పేదల ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఓ వరంలాంటిదని శ్రీశైలం నియోజకవర్గం శాసన సభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం వేల్పనూరు గ్రామం ఎమ్మెల్యే స్వగృహంలో 22 మంది లబ్ధిదారులకు రూ 44,58,777ల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే బుడ్డా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటిమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, పేద ప్రజల సంక్షేమాభివృద్ధికి పెద్దపీత వేస్తు ఆపదలో ఉన్న వారికి అండగా నిలిస్తుందన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ కనీసం ఆసుపత్రిలో చూపించుకునేందుకు కూడా ఆర్థిక స్థోమత లేని పేద, మధ్యతరగతి ప్రజలక అండగా నిలిచి ఆర్థిక భరోసా నిచ్చేందుకు ముఖ్యమంత్రి సహాయనిధికి శ్రీకారం చుట్టిందన్నారు. నియోజకవర్గంలోని ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమని, మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధితో పాటు సొంత నిధులతో రోగులకు అండగా నిలుస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలి

**ఆకట్టుకుంటున్న బీవీ స్మారక క్రికెట్ టోర్నీ**

**అండర్ 14 బాయ్స్, అండర్ 17 మహిళలతో పోటీ**



అండర్ -17 మహిళల జట్టుతో పట్టణ సీఐ వి. శ్రీనివాసులు, నిర్వాహకులు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకొని ఇష్టమైన ఆటలో రాణించాలని పట్టణ సీఐ వి. శ్రీనివాసులు అన్నారు. శ్రీ నీలకంటేశ్వర స్వామి జాతర సందర్భంగా మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి స్మారక క్రికెట్ పోటీలు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎంతో కోలాహలంగా జరుగుతున్నాయి. ఆదివారం ప్రత్యేకమైన మ్యాచ్ నిర్వహించారు. కర్నూలు జిల్లా అండర్ 17 మహిళలు వర్సెస్ అండర్ 14 బాయ్స్ జట్ల మధ్య లెదర్ బాల్ పోటీ జరిగింది. ఈ మ్యాచ్ లో మొదట అండర్ 17 మహిళల జట్టు బ్యాటింగ్ చేసి 16 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 105 పరుగులు చేశారు. తరువాత బ్యాటింగ్ చేసిన అండర్ 14 బాయ్స్ జట్టు కేవలం రెండు వికెట్లు నష్టపోయి 106 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో రాణించిన విద్యార్థులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడ స్పూర్తితో ముందుకు పోవాలన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులు రంగస్వామి గౌడ్, సురేష్ చౌదరి, దోమ భీమేష్, భార్గవ్ యాదవ్ సుధీర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## స్వంత గ్రామాలను చేరుతున్న వలస కూలీలు



నాలుగు నెలల తరువాత స్వంతగ్రామాలకు చేరగానే వాహనాలు దిగుతున్న వలసకూలీలు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** బతుకు జీవుడా అంటు కడుపు చేతపట్టుకొని గ్రామాల నుంచి వలస వెళ్లిన కూలీలు పండుగలు, దేవరలు రావడతో గత రెండు మూడు రోజులుగా స్వంతగ్రామాలు చేరుతున్నారు. దీంతో గ్రామాలలోని వీదులు కళకళలాడుతున్నాయి. రాత్రి పూట వీదులలోని ఆరుగులపై పిల్లపాపలు పెద్దలు కూర్చొని బతుకుతెరువుకోసం వెళ్లిన ప్రాంతాలలో జరిగిని విశేషాలను తమ తోటి వారితో పంచుకుంటు కాలక్షేపం చేస్తున్నారు. క్రిష్టమస్, నూతన సంవత్సరంవేడుకలు, సంక్రాంతి,పెళ్లిళ్లు, గ్రామాలలో దేవరలు, జాతరలు రావడంతో వలస వెళ్లిన చోట సంపాదించుకున్న సొమ్ముతో కూలీలు స్వంతగ్రామాలను చేరుతున్నారు. దీంతో కిరాణం దుఖానాలు, బట్టల దుఖానాలు, తెల్లవారుజామున హొటళ్లు వ్యాపారంతో కళకళలాడుత ఉన్నాయి. గ్రామాలలో పాడుపోయిన వీదులు సందడితో నిండాయి. వలస వెళ్లిన చోట సంపాదించికున్న సొమ్ముతో ఇక్కడ బందువుల పెళ్లిళ్ళ పండుగులు, జాతర్ల సందడిగా చేయ డానికి వచ్చామని తెలుపుతున్నారు. ఇప్పటికే గోనెగండ్ల, గంజహళ్లి, బైలుప్పల, కులుమాల, అలువాల, హెచ్ కైరవాడి, పెద్దనేలటూరు, తిప్పనూరు, వీరంపల్లి గ్రామాలను వలస కూలీలు చేరారు. దాదాపు మండల వ్యాప్తంగా 6వేల నుంచి 8వేల మంది కూలీలు మండలంలోని స్వంతగ్రామాలను చేరినట్లు తెలుస్తుంది.

## గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి

**బనగానపల్లెమేజర్,న్యూస్ః**

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని బనగానపల్లె ఎంపిడిఓ రమణ తెలిపారు. ఆదివారంనాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు బనగానపల్లె మండల సర్వసభ్య సమావేశాన్ని మండల అద్యక్షురాలు శ్రీమతి హెచ్. మానసవీణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మాట్లాడుతూ అధికారులు నాయకులతో కలిసి సమన్వయంతో పనిచేసి గ్రామంలో అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. గ్రామాలలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాలన్నారు. పారిశుధ్యం, త్రాగునీరు, మౌళిక వసతులు వంటి వాటిని పర్యవేక్షించాలన్నారు. అన్ని శాఖల మండలస్థాయి అధికారులు సర్పంచ్లు , ఎంపిటీసీలు పాల్గొన్నారు.



# మైనర్‌లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులకు జైలు

**– ట్రాఫిక్ సిఐ మల్లికార్జున గుప్తా**


యువకులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున గుప్తా

**నంద్యాల క్రైం, మేజర్‌న్యూస్ :** మైనర్‌లకు వాహనాలు ఇచ్చినా, వారు ప్రమాదాలకు పాల్పడినా వారి తల్లిదండ్రులకు శిక్ష పడే అవకాశం ఉందని నంద్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున గుప్తా హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ మల్లికార్జున గుప్తా మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు అందరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవని అన్నారు. యువకులు అత్యుత్సాహంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ప్రతిఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్య స్థానాలకు చేరాలని అన్నారు. 15 మంది మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడటంతో వారి తల్లిదండ్రుల సమక్ష్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి హెచ్చరికలు జారీ చేసి జరిమానా విధించారు.

# వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చేవరకు పోరాటం చేయాలి


సంఘీభావం తెలుపుతున్న కప్పట్రాళ్ల బొజ్జమ్మ,వాల్మికి సంఘం నాయకులు

**ఆలూరు,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో బోయ,వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలోకి చేర్చే వరకు పోరాటం చేయాలని రాష్ట్ర వాల్మికి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ,మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు,రాష్ట్ర నాయకురాలు గుడిసి కృష్ణమ్మ,వలసల రామకృష్ణ, రాంభీం నాయుడులు అన్నారు.ఆదివారం తుగ్గలి మండలం మారేళ్ల గ్రామంలో బి.వి.ఎస్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా వాల్మీకులను గుర్తిస్తున్నారని అలాగే కర్ణాటకలో ఎస్టీ జాబితాలో ఉన్నారని ఏపీ లో కూడా ఎస్టీ జాబితాలోకి చేర్చాలని వారి డిమాండ్ చేశారు.కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# గ్రామాలలో మొదలైన క్రిస్మస్ సందడి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గోనెగండ్ల మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం క్రిస్మస్ సందడి మొదలైంది. రాబోతున్న క్రిస్మస్ సందర్భంగా మరియమ్మ, బాల ఏసు, దూతలు, జ్ఞానులు, ప్రధానయ జమానులు, గొల్లలు, బుట్టలు వేశదారణలతో వంద మంది పిల్లలు వేశదారణలతో అలరించారు. గ్రామంలోని పలు వీదులలో తిరిగి క్రీస్తు గొప్పతనంను ఆయన మానవాలికి సూచించిన మార్గంను వివరించారు.ఈ కార్యక్రమంలో తిమోతిపాల్, కేరల్ కాంతమ్మ, కావళి, జయకాంత్, సరేఖ, సౌభాగ్య, పిల్లలు పాల్గొన్నారు.



# శ్రీశ్రీ బంగారమ్మ.. మారెమ్మవ్వ దేవత విగ్రహాల ఊరేగింపు





**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల పరిధిలోని గవిగట్టు గ్రామంలో నూతనంగా తయారు చేసిన శ్రీ శ్రీ బంగారమ్మ. మారెమ్మవ్వల దేవత మూర్తి విగ్రహలను ఆదివారం ఉదయం గ్రామ ప్రజలు దేవత మూర్తి లను ట్రాక్టర్ పై ఉంచి ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున విగ్రహలు వద్దకు చేరుకున్నారు. అక్కడ నుండి మహిళలు తమ కళశాలతో దేవత మూర్తిలను గ్రామ చివరి నుండి స్థాని క బంగారమ్మ దేవాలయం వరకు మేళ తాళలతోను డప్పులు డ్రమ్స్ లతోను గ్రామం పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి స్థానిక బంగారమ్మ దేవాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అక్కడదేవత మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.సోమవారం దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మంగళవారం రోజున గ్రామంలో ప్రతి కటుంబంలోని ఆడబిడ్డలకు ఒడి బియ్యం నింపుతారని గ్రామస్తులు తెలిపారు.

# వృక్ష శాస్త్ర అధ్యాపకుడికి ఘన సత్కారం

**పత్తికొండ టౌన్, మేజర్ న్యూస్ :** అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణంలో కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణీత శాస్త్రవేత్త శ్రీరామానుజం 125వ జన్మదినాన్ని పురస్కరించుకొని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రఘురామ్మూర్తి ఆధ్వర్యంలో గణీత శాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వృక్ష శాస్త్ర అధ్యాపకునిగా, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారిగా తన విధులను సక్రమంగా నిర్వర్తించడం వలన ఆయన సేవలను గుర్తించి శాసనసభ్యులు కాల్వ శ్రీనివాసులు చేతులమీదుగా పత్తికొండ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకుడు మునగాల రామకృష్ణాకు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇలాంటి అధ్యాపకులను ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే చేతులమీదుగా సత్కారం అందుకుంటున్న అధ్యాపకుడు

# ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను కలిసిన పిపి. బత్తిన


ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియను మర్యాదపూర్వకంగా కలిగిన దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియను ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా కోర్టు పిపిగా నియామకమైన బత్తిన శివప్రసాద్ రావు ఆదివారం తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పీపీగా నియమితుడైన బత్తిన శివప్రసాద్ రావుకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అభినందించారు.

# దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని దివ్యాంగుల జెఏసి నాయకులు దేవరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం దివ్యాంగుల సంఘం నాయకులు మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.10 లక్షల వరకు ఉచిత రుణాలు ఇవ్వాలని దివ్యాంగుల అట్రాసిటి చట్టాన్ని అమలు చేయాలని దివ్యాంగులకు వార్షిక బడ్జెట్‌లో రూ.6 వేల కోట్లు కేటాయించాలని తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించే లా స్థానిక మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డికి త్వరలో లేఖ రాయనున్నట్లు దివ్యాంగుల నాయకులు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని దివ్యాంగులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు చెన్నయ్య, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దివ్యాంగుల జెఏసి నాయకులు

# పడకేసిన పారిశుద్ధ్యం.. ఇబ్బందుల్లో ప్రజలు

**– పందులకు స్థావరమైన వైనం**


పందులకు స్థావరంగా, మురికి కూపంగా ఉన్న దృశ్యం

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానందిగ్రామంలోని దేవస్థానం కాలనీలో పారిశుద్ధ్యం పడకేసింది. పందులకు స్థావరంగా నిలిచి దుర్వాసనలు వెదజల్లుతూ అంటు రోగాలకు నిలయంగా మారింది. మురుగు నీరు బయటికి వెళ్లేందుకు వీలు లేకపోవడంతో నీరు నిల్వ ఉండిపందులు స్థావరంగా మార్చుకోవడంతో తీవ్ర స్థాయిలో దుర్వాసన వెదజల్లుతోంది. కాలనీ ప్రజలు, లాడ్జీల నిర్వాహకులు చెత్తా, చెదారాన్ని అక్కడే వేస్తుండటంతో దిబ్బలుగా మారి విష పురుగులకు స్థావరంగా, అంటు రోగాలకు నిలయంగా మారాయి. మండల స్థాయి అధికారులు తగు చర్యలు తీసుకుని ప్రజలను అంటు రోగాల నుంచి రక్షించాలని దుర్వాసనలు వెదజల్లకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# తానా అధ్యక్షుడిని కలిసిన బుర్రారెడ్డిపల్లె సర్పంచ్

**– గుండ్రాతి బాల సుబ్బయ్య**


తానా అధ్యక్షున్ని కలిసిన సర్పంచ్ బాల సుబ్బయ్య

**దొర్నిపాడుమేజర్,న్యూస్ః** మండలంలోని బుర్రారెడ్డిపల్లె గ్రామ సర్పంచ్ గుండ్రాతి బాల సుబ్బయ్య ఆదివారం శిరివెళ్ల మండలం రాజనగరం గ్రామ నివాసి, తానా అద్యక్షుడైన శృంగవరపు నిరంజన్‌ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ బాల సుబ్బయ్య గ్రామ ప్రజల కొరకు మినరల్ వాటర్ ప్లాంట్ గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లగా స్పందించి వెంటనే ఆయన బుర్రారెడ్డిపల్లె గ్రామంలో మినరల్ వాటర్‌ప్లాంట్ తప్పకుండా ఏర్పాటు చేస్తానని సర్పంచ్‌కు హామి ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాల సుబ్బయ్య మాట్లాడుతూ మినరల్ వాటర్ ప్లాంట్ తీర్మాణం గురించి అడిగిన వెంటనే స్పందించి మరోమారు తన మానవతా హృదయాన్ని చాటుకున్న శృంగవరపు నిరంజన్‌కు గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెల్పుతున్నట్లు ఆయన తెలిపారు. నిత్యం ప్రజా సమస్యలపై స్పందిస్తూ సేవ చేస్తున్న తానా అద్యక్షుడు నిరంజన్ మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శృంగవరపు నిరంజన్, సర్పంచ్ బాల సుబ్బయ్య, ఓబులేసు, సుబ్రమణ్యం, రామ్మోహన్‌లు పాల్గొన్నారు.

# 23న బందార్లపల్లెకు మంత్రి బి.సి రాక

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః**

కొలిమిగుండ్ల మండలం బందార్లపల్లె చెక్ పోస్ట్ వద్ద గత ఐదు రోజుల నుండి నాపరాతి కార్మికులు మరియు గని యజమానులు ఫ్యాక్టరీ యజమానులు , ట్రాక్టరు లారీ యజమానులు మరియు డ్రైవర్లు చేస్తున్న దీక్షా కార్యక్రమానికి రోడ్లు భవనాల శాఖా మంత్రి మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి 23న బందార్లపల్లె చెక్ పోస్ట్ వద్ద జరుగుతున్న దీక్షా కార్యక్రమానికి హాజరవుతున్నారు. కావున నాపరాతి సమస్యలు తెలియజేయుటకు గనులు ఉన్న ప్రతి ఒక్కరూ హాజరై తమరికి జరుగుతున్న సమస్యలు మినిస్టర్ గారికి తెలియజేయాలని మూలే రామేశ్వర రెడ్డి తెలిపారు.

సూర్య

సోమవారం | 23 డిసెంబరు 2024

# SSC, RRB, PSC Police, Bank Exams

# REASONING ODD MAN OUT

(గత సంచిక తరువాయి.....)

**67. క్రింది వానిలో భిన్నమైనది ఏది?**

ఎ. DGP (729) బి. IGP (1024)

సి. DIG (400) డి. SI (748)

జవాబు :

ఎ. DGP (729) --> As per Alphabets,

D place is 4, G Place is 7, P Place is 16

DGP=4+7+16=27

$(27)^2$=27x27=729

బి. IGP (1024) --> As per Alphabets,

I place is 9, G place is 7, P Place is 16.

IGP=9+7+16=32

$(32)^2$=32x32=1024

సి. DIG (400) -- > As per alphabets,

D place is 4, I place is 9, G place is 7.

DIG =4+9+7=20

$(20)^2$=20x20=400

డి. SI (748) --> as per Alphabets,

S place is 19, I place is 9

SI = 19+9=28

$(28)^2$=28x28=784. కాని లెక్క ప్రకార్ 748 రావాలి. ఇది భిన్నమైనది.

**68. క్రింది వానిలో భిన్నమైనది ఏది?**

ఎ. W(25)R బి. N(4)M

సి. I(49)B డి. S(100)I

జవాబు :

ఎ. W(25)R --> as per Alphabets,

W place is 23, R Place is 18

W-R = 23-18=5.

$5^2$ =25

బి. N(4)M --> as per Alphabets,

N place is 14, M place is 13

N-M=14=13=1

$1^2$ =1. కాని లెక్క ప్రకారం 4 రావాలి. కాబట్టి ఇది భిన్నమైనది.

సి. I(49)B--> as per Alphabets,

I place is 9, B place is 2

I-B =9-2=7

$7^2$ =49

S(100)I ----> as per Alphabets,

S place is 19, I place is 9.

S-I=19-9=10

$10^2$=100

బి. చంద్రుడు – గ్రహం కాదు. ఇది భిన్నమైనది.

సి. బృహస్పతి – గ్రహం

డి. శుక్రుడు – గ్రహం.

**71. క్రింది వానిలో భిన్నమైనది ఏది?**

ఎ. 173 బి. 263

సి. 284 డి. 362

జవాబు :

ఎ. 173 సంఖ్యను విడివిడిగా కూడితే 1+7+3=11 అవుతుంది.

బి. 263 సంఖ్యను విడివిడిగా కూడితే 2+6+3=11 అవుతుంది.

సి. 284 సంఖ్యలోని అంకెలను విడివిడిగా కూడితే

## భిన్న పరీక్ష

**69. క్రింది వానిలో భిన్నమైనది ఏది?**

ఎ. నిబంధన 352 బి. నిబంధన 360

సి. నిబంధన 356 డి. నిబంధన 368

జవాబు :

నిబంధన 368 రాజ్యాంగపు సవరణ విధానం తెలుపును. ఇది భిన్నమైనది. మిగిలినవి 352, 360, 356 ఎమర్జెన్సీలకు సంబంధించి రాష్ట్రపతి అధికారాలు.

**70. క్రింది వానిలో భిన్నమైనది ఏది?**

ఎ. భూమి బి. చంద్రుడు

సి. బృహస్పతి డి. శుక్రుడు

జవాబు :

ఎ.భూమి – గ్రహం

2+8+4=14 అవుతుంది. లెక్క ప్రకారం 11 రావాలి. కాబట్టి ఇది భిన్నమైనది.

డి. 362 సంఖ్యలోని అంకెలను విడివిడిగా రాసి కూడితే 3+6+2=11.

**72. క్రింది వానిలో భిన్నమైనది ఏది?**

ఎ. 3229 బి. 4127

సి. 5218 డి. 7018

జవాబు :

ఎ. 3229 సంఖ్యను విడివిడిగా రాసి కూడాలి. 3+2+2+9=16 అవుతుంది.

బి. 4127 సంఖ్యలోని అంకెలను విడిగా రాసి కూడగా 4+1+2+7=14 కాని లెక్క ప్రకారం 16 రావాలి. ఇది భిన్నమైనది.

సి. 5218 లోని అంకెలను కూడగా 5+2+1+8=16 అవుతుంది.

డి. 7018 సంఖ్యలోని అంకెలను రాసి కూడగా 7+0+1+8=16 అవుతుంది.

**73. క్రింది వానిలో భిన్నమైనది ఏది?**

ఎ. NMLK బి. RQPO

సి. UTSR డి. WXUV

ఎ. NMLK ఇచ్చిన Alphabets ను reverse లో రాయగా

NMLK --> KLMN అవుతుంది. వరుసగా ఉన్నాయి.

బి. RQPO ఇచ్చిన Alphabets ను reverse లో రాయగా

RQPO --> OPQR అవుతుంది. వరుసగా ఉన్నాయి.

సి. UTSR ఇచ్చిన Alphabets ను reverse లో రాయగా

UTSR--> RSTU అవుతుంది. వరుసగా ఉన్నాయి.

డి. WXUV ఇచ్చిన Alphabets ను reverse లో రాయగా

WXUV--> VUXW ఇవి వరుసక్రమంలో లేవు. అందువల్ల ఇది భిన్నమైనది.



Dr.M.Reddi Ramu,
Professor
Viswam Engineering College, Madanapalli

# డియస్సీ టెట్ ప్రత్యేకం జాగ్రఫీ



(గత సంచిక తరువాయి.....)

**18. క్రింది ఖండాలను ఆరోహణ క్రమంలో అమర్చండి.**

1. దక్షిణ అమెరికా, ఉత్తర అమెరికా, ఆఫ్రికా, ఆసియా
2. ఆసియా, ఆఫ్రికా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా
3. ఆస్ట్రేలియా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఆఫ్రికా
4. ఉత్తర అమెరికా, యూరప్, ఆఫ్రికా, ఆస్ట్రేలియా

**19. క్రింది వానిలో పశ్చిమార్ధ గోళంలో లేని ఖండాలను గుర్తించండి.**

1. ఉత్తర అమెరికా 2. యూరప్
3. ఆఫ్రికా 4. ఆసియా

**20. క్రింది వాటిలో రేఖాంశాల గురించి సరైన వాక్యాన్ని గుర్తించండి.**

ఎ. రేఖాంశం పటం పొడవును లేదా ఎత్తును సూచిస్తుంది.

బి. రేఖాంశాలు పూర్తి వృత్తాలు కాదు.

సి. ప్రతి రేఖాంశం ప్రతి అక్షాంశాన్ని ఛేదిస్తుంది.

డి. రేఖాంశాలను మెరిడియన్లు అని కూడా అంటారు.

1. ఎ మరియు బి 2. బి మరియు సి
3. ఎ,బి మరియు సి 4. ఎ,బి,సి,డి

**21. క్రింది వాటిని జతపరుచుము.**

1. $66^0\ ^1/_2$ఉత్తర అక్షాంశం ఎ. అంతర్జాతీయ దినరేఖ
2. $66^0\ ^1/_2$ దక్షిణ అక్షాంశం బి. ఆర్కిటిక్ వలయం
3. $180^0$ తూర్పు పడమర రేఖాంశం సి. ఉత్తర ధృవం
4. $90^0$ ఉత్తర అక్షాంశం డి. అంటార్కిటిక్ వలయం

1. 1–ఎ, 2–బి, 3–సి, 4–డి
2. 1–డి, 2–సి, 3–బి, 4–ఎ
3. 1–బి, 2–డి, 3–ఎ, 4–సి
4. 1–సి, 2–డి, 3–బి, 4–ఎ

**22. ఆకాశం పైనుండి చూస్తే సూర్యకాంతి పడే భాగాన్ని ఏమంటారు?**

1. ఇతివృత్తం 2. ప్రకాశవృత్తం
3. ప్రకాశవంతమైన ప్రాంతం 4. దీర్ఘమైన వృత్తం

**23. భూ కేంద్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు ఎవరు?**




1. టాలమీ
2. నికోలస్ కోపర్నికస్ 3. ఇమ్మాన్యుయల్ కాంట్
4. జీన్స్ & జెఫ్రిన్

**24. క్రింది వాటిని పరిశీలింపుము**

ప్రతిపాదన (ఎ) : రేఖాంశాలను మధ్యాహ్న రేఖలని కూడా అంటారు.

కారణం (ఆర్) : రేఖాంశాలను మెరిడియన్స్ అంటారు. మెరిడియన్లు అనగా మధ్యాహ్నం.

1. (ఎ) మరియు (ఆర్) రెండూ సరైనవే మరియు (ఎ)కి (ఆర్) సరియైన వివరణ.
2. (ఎ) మరియు (ఆర్) సరైనవే మరియు (ఎ)కి (ఆర్) సరియైన వివరణ కాదు.
3. (ఎ) నిజమైనది కాని (ఆర్) నిజమైనది కాదు.
4. (ఎ) నిజమైనది కాదు కాని (ఆర్) నిజమైనది.

**25. లారేషియా మరియు గోండ్వానా భూ భాగాలను వేరు చేస్తున్నటువంటి దానిని గుర్తించుము.**

ఎ. హిమాలయాలు బి. టెథిస్ సముద్రం

సి. అంటార్కిటికా డి. ఆర్కిటిక్

1. ఎ మాత్రమే 2. ఎ మరియు బి
3. బి మరియు సి 4. ఎ మరియు డి

**26. క్రింది వాటిని జతపరుచుము**

1. భూ కేంద్రక సిద్ధాంతము ఎ. ఇమాన్యుల్ కాంట్
2. సూర్యకేంద్రక సిద్ధాంతము బి. ఆల్ఫ్రెడ్ వెజినర్
3. ఖండచలన సిద్ధాంతము సి. నికోలస్ కోపర్నికస్
4. వాయు పరికల్పన సిద్ధాంతము డి. టాలెమి.

1. 1–ఎ, 2–బి, 3–సి, 4–డి
2. 1–బి, 2–డి, 3–ఎ, 4–సి
3. 1–డి, 2–సి, 3–బి, 4–ఎ
4. 1–సి, 2–డి, 3–బి, 4–ఎ

**27. క్రింది వానిలో సరైన అంశాలను గుర్తించండి.**

ఎ. సూర్యుడు చుట్టూ భూమి గంటకు 1,07,200 కి.మీ. వేగంతో తిరుగుతుంది.

బి. భూమి కేంద్రము 6000 కి.మీ. పైన ఉంటుంది.

సి. భూమి మొత్తం ఘనపరిమాణంలో భూ ప్రావారం 16%

డి. సూర్యుడికి భూమికి సగటు దూరం 147 మిలియన్ చ. కి.మీ.

1. ఎ మరియు బి 2. బి మరియు సి
3. ఎ,బి మరియు సి 4. ఎ,బి,సి,డి

**28. క్రింది అంశాల వాస్తవికతను గుర్తించుము.**

ఎ. మానవ చరిత్ర అంతా పసుపుపచ్చ వృత్తంలోని చిన్న చుక్కలో జరిగిందని కార్ల గాన్ పేర్కొన్నారు.

బి. అంతరిక్షం నుండి భూమిని తీసిన ఫోటోను పాలిపోయిన నీలం చుక్క అంటారు.

1. ఎ మరియు బి రెండూ నిజమైనవి.
2. ఎ తప్పు మరియు బి నిజమైనది.
3. ఎ నిజమైనది కాని బి తప్పు
4. ఎ మరియు బి రెండూ తప్పు

**29. భూమిని ప్రధానంగా ఎన్ని పొరలుగా విభజించవచ్చు?**

ఎ. భూ పటలము బి. భూ ప్రావరం

సి. భూ కేంద్ర మండలం

1. ఎ మరియు బి 2. బి మరియు సి
3. ఎ,బి మరియు సి 4. ఎ మరియు సి

**30. క్రింది వాటిలో సరికాని అంశాన్ని గుర్తించండి.**

1. డిగ్రీలను ( 0 ) లలో తెలియజేస్తారు.
2. నిమిషాలను ( ı ) లలో తెలియజేస్తారు.
3. సెకండ్లను ( ıı ) లలో తెలియజేస్తారు.
4. ఉష్ణోగ్రతను ( = ) లలో తెలియజేస్తారు.

**జవాబులు :**

18)1, 19)4, 20)4, 21)3, 22)2, 23)1, 24)1, 25)2, 26)3, 27)4, 28)1, 29)3, 30)4



పాదం సుధాకర్
ఫ్యాకల్టీ, హైదరాబాద్.

# నేత్ర వైద్యుల ప్రాంతీయ వైజ్ఞానిక సదస్సు

**కర్నూలు, నంద్యాల జిల్లా నేత్ర వైద్యుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ..**
**నిరంతర వైద్య విద్య ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తుంది: డాక్టర్ రవి కృష్ణ**


జ్యోతి ప్రజ్వలన చేసి నేత్రవైద్యుల ప్రాంతీయ వైజ్ఞానిక సదస్సు ప్రారంభిస్తున్న డాక్టర్ జి.రవికృష్ణ

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** నంద్యాల,కర్నూలు జిల్లాల నేత్ర వైద్యుల సంఘాల సంయుక్త నిర్వహణలో ఆదివారం స్థానిక మధుమణి ఆసుపత్రి సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ నేత్ర వైద్యుల సంఘం ఆధ్వర్యంలో, ఆప్తాల్మిక్ సొసైటీ అకాడమిక్ రీసెర్చ్ కమిటీ పర్యవేక్షణలో నేత్ర వైద్యుల కోసం" కంటిలో గ్లకోమా సమస్యలు" అన్న అంశంపై ప్రాంతీయ వైజ్ఞానిక వైద్య సదస్సు నిర్వహించారు. నంద్యాల జిల్లా నేత్ర వైద్యుల సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్బారెడ్డి అధ్యక్షతన, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ విజయభాస్కర రెడ్డి, చీఫ్ పాట్రన్ డాక్టర్ జగన్మోహన్ నిర్వహణలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ నర్సిరెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మహిళా వైద్య విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, రాష్ట్ర ఆప్తాల్మిక్ సొసైటీ అకాడమిక్ రీసెర్చ్ కమిటీ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ అన్ని విభాగాల వైద్యులు నిరంతరం వైజ్ఞానిక సదస్సులు నిర్వహించడం ద్వారా తమ వైద్య విజ్ఞానాన్ని మెరుగు పరుచుకోవాలని,ఆధునిక వైద్య విధానాలు,నూతన పరికరాల గురించి అవగాహన పెంచుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. డాక్టర్ లక్ష్మీ సౌజన్య మాట్లాడుతూ నంద్యాలలో ప్రాంతీయ నేత్రవైద్యుల వైజ్ఞానిక సదస్సు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ప్రత్యేక వైద్య విభాగాలలో ఒక్కోసారి ఒక అంశం మీద ప్రత్యేక సదస్సులు నిర్వహించడం ఆ జబ్బులపైలోతైన అవగాహన కల్పిస్తుందన్నారు. నిర్వాహక కార్యదర్శి డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, చీఫ్‌పాట్రన్ డాక్టర్ జగన్మోహన్, కర్నూలు జిల్లా నేత్ర వైద్యుల సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ నర్సిరెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ నాగ సురేష్, డాక్టర్ సంజీవ్ సభలో ప్రసంగిస్తూ యువ నేత్ర వైద్యుల కోసం నిరంతర వైద్య విద్యా కార్యక్రమాలు తరచూ నిర్వహించి వారికి ఆధునిక చికిత్స విధానాలపై కార్యశాలలు నిర్వహిస్తామని తెలిపారు. తద్వారా ప్రజలకు ఆధునిక నేత్ర వైద్యాన్ని అందిస్తామన్నారు. ఈ సదస్సులో వివిధ అంశాలపై ప్రత్యేక వక్తలుగా పాల్గొన్నప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ క్రాంతి, డాక్టర్ మదన్మోహన్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ విజయ, డాక్టర్ సింధూర మల్టీమీడియా ప్రజెంటేషన్ ద్వారా సదస్సులో ఉపన్యసించారు. వక్తలను ఆహ్వాన కమిటీ తరఫున సత్కరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల, కర్నూలు,అనంతపురం తదితర జిల్లాల నుండినేత్ర వైద్యులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేద ప్రజల కోసమే నంద్యాల జిల్లా మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఏపి మెడికల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు డా.జి.రవిక్రిష్ణ, జిల్లా అధ్యక్షులు డా. మధుసుదన్రావు అన్నారు. వీరిరువురు ఆదివారం మండల కేంద్రమైన చాగలమర్రి మండలంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి హాజరయి జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 500ల మందికి పైగా వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న నిరుపేద ప్రజలకు కార్పోరేటు స్థాయి వైద్యాన్ని అందించేందుకు ఈ శిబిరంలో నరాల, ఎముకలు, కీళ్ళు, చెవి, ముక్కు, గొంతు, స్త్రీ వ్యాధులు, దంత, గైనకాలజీ, చర్మ వ్యాధి. చిన్న పిల్లల, ఫిజియో థెరపి మరియు ఇతర వ్యాధుల నిపుణులైన వైద్యులు 23 మంది పాల్గొన్నారన్నారు. అలాగే గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి ఇండస్ సూపర్స్పెషాలిటీ ఆసుపత్రికి చెందిన వైద్య బృందం పాల్గొన్నారని వీరితో పాటు గుండెకు సంబంధించి 2డిఎకో ఈసిజి పరిక్షలను కూడా నిర్వహించినట్లు వారు తెలిపారు. అంతే కాకుండా వైద్య పరీక్షల అనంతరం ఏదైన శస్త్ర చికిత్స అవసరమైతే తమ ఆసుపత్రుల్లో ఉచితంగా నిర్వహిస్తామని డా.మధుసుదన్రావు తెలిపారు. ఈ శిబిరంలో వైద్యసేవలు పొందిన వారికిఆర్యవైశ్య సంఘం నాయకులు సుంకు జనార్ధనరావు, పార్ధసారథిలు ఉచితం మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డా.బి.ఈ.పనిల్ కుమార్, కోశాధికారి డా.ఓ.సురేంద్రనాథ్ రెడ్డి వివిధ విభాగాలకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు, వి.లక్ష్మణబాబు, ప్రధానకార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి నవత ప్రసాద్ సభ్యులు బచ్చు శ్రీనివాసులు, ఎ.రవీంద్రకుమార్, తోమ్మం ద్రు నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.




# గణిత శాస్త్రం ఓ అద్భుత శాస్త్రం-ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హుస్సేన్ బాషా

**-డిగ్రీ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవం**


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ హుస్సేన్ భాష

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** గణితం అనేది ప్రతిరోజు మన జీవితంలో అనుసంధానమైన ఒక అద్భుత శాస్త్రం అని శ్రీశైలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. హుస్సేన్ భాష అన్నారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవాన్ని ఆదివారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. రామానుజన్ స్వయంకృషి, ఆత్మ విశ్వాసంతో గణితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని వారి జీవితం మనకు ఒక గొప్ప ప్రేరణ,వారు సృష్టించిన సంక్లిష్ట సూత్రాలు, సమీకరణాలు ప్రపంచవ్యాప్తంగా గణిత శాస్త్రంలో మార్గ దర్శకంగా నిలిచాయన్నారు. అనంతరం గణిత అధ్యాపకుడు బి.నరేంద్రనాథ రెడ్డి మాట్లాడుతూ..రామానుజన్ జీవితాన్ని చూస్తే ఎంత సాధన, ఆత్మవిశ్వాసం ఉంటే ఏ దారి లోనైనా విజయాన్ని సాధించవచ్చని స్పష్టమవుతుందన్నారు. వారి గణిత సూత్రాలు ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచి ఆ సమయంలో వారిని అర్థం చేసుకోలేకపోయిన ప్రపంచం నేడు వారి ప్రతిభను ప్రశంసిస్తోందన్నారు. ఈ సందర్భంలో వారి జీవితం మనకు ఒక గొప్ప పాఠంగా నిలుస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం.బుచ్చయ్య,మహేశ్వర రెడ్డి, పూర్ణేశ్వర రెడ్డి,డి. బాలుగ్రామ్, రజాక్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి ఎంతో శ్రేయస్కరం

**నంద్యాల నూనెపల్లె, మేజర్న్యూస్ :** నంద్యాల పట్టణంలోని వైయస్సార్ నగర్ మరాఠీ కాలనీలో జీవము గల దేవుని ఆలయంలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి ఎంతో శ్రేయస్కరమని అందరూ వారి మార్గంలో నడవాలని క్రీస్తు జనను ప్రపంచానికి వెలుగని ప్రేమ, శాంతితో అందరితో కలిసిమెలిసి ఉండాలని మనమంతా ఒక్కటే అని తెలిపారు. ఫాస్టర్ కందుల పాల్‌రాజ్, ఫాస్టర్ ఏసన్న, తాటికొండ బుగ్గరాముడు, మరాఠీ సూరి, ఫాస్టర్ స్టీఫెన్ జోసఫ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# బిసిల సంక్షేమాభివృద్ధి పై దృష్టిసారించాలి

**- బిసి సంక్షేమ సంఘం నాయకులు**


మాట్లాడుతున్న బిసి సంక్షేమ సంఘం నాయకులు

**ఆత్మకూరు, మేజర్న్యూస్:** బిసిల సమస్యలను పరిష్కరించి వారి సంక్షేమాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని రంగాల్లో బిసిలకు ప్రాధాన్యత నివ్వాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్, గౌరవ అధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ మాన్యం బాలస్వామి యాదవ్‌లు కోరారు. ఆదివారం పట్టణంలోని బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన అధిక శాతం ఉన్న బిసిలకు అన్నింటిలో తగిన ప్రాధాన్యత ఇచ్చి బిసి అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. నామినేటెడ్ పదవులలో బిసిలకు ప్రాధాన్యతనివ్వాలని కోరారు. మార్కెట్‌యార్డు చైర్మన్ బిసిలకు కేటాయించాలన్నారు. పట్టణంలో బిసి భవన్‌కు స్థలం కేటాయించి భవనం నిర్మించి , బిసిల సంక్షేమానికి పెద్ద పీట వేయాలన్నారు. చట్టసభల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్ కల్పించేలా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదికలు పంపాలన్నారు. ప్రైవేటు ఉద్యోగాల్లో కూడా బిసిలకు రిజర్వేషన్ కల్పించి, వారి సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# దేవర ఉత్సవాలకు ముస్తాబు

**- పారుశుద్ధ్యపనులు, వీధిలైట్లు ఏర్పాటు - సాతనూరు సర్పంచ్ మంగమ్మ**


సాతనూరులో వీధిలైట్లు ఏర్పాటుచేస్తున్న దృశ్యం,


గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్న సర్పంచ్

**కోసిగి మేజర్ న్యూస్:** మండల పరిధిలోని త్వరలో జరుగబోయే దేవర ఉత్సవాలకు ముస్తాబు చేపట్టడం జరుగుతుంది. సాతనూరు గ్రామంలో మంగళ, బుధ వారాలలో జరిగే గ్రామదేవతల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్ కురువ మంగమ్మ, కురువ చంద్ర తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామన్నారు. డ్రైనేజీ, మురుగునీటి తొలగింపు, చెత్తాచెదారం వంటివాటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లడం జరుగుతుందన్నారు. అలాగే గ్రామంలో ఎలాంటి చీకటి లేకుండా వీధిలైట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దేవర ఉత్సవాల్లో ఎలాంటి అంటురోగాలు ప్రభలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈకార్యక్రమంలో భీమా, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలకు ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

**కోవెలకుంట్ల, మేజర్న్యూస్ :** కోవెలకుంట్లలోని ఎల్ఎం కాంపౌండ్‌లో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు సిపిఎం నాయకులు సుధాకర్ తెలిపారు. ఈ ముగ్గుల పోటీల్లో 30 మంది మహిళలు పాల్గొన్నారు. ఇందులో మొదటి బహుమతి లీలావతి, రెండవ బహుమతి మణి, మూడవ బహుమతి ప్రమీల, నాలుగవ బహుమతి వసంత, భార్గవిలు గెలుపొందారు. ఈ కార్యక్రమంలో ఓబులేసు, రామాంజనేయులు, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక లోపంతో ఆగిన లారీ

**- భారీగా ట్రాఫిక్ జామ్**


నల్లమల ఘాట్‌లో మలుపు వద్ద నిలిచిపోయిన లారీ

**మహానంది, మేజర్న్యూస్ :** గిద్దలూరు నుంచి నంద్యాల వైపు అధిక లోడుతో వస్తున్న లారీ నల్లమల ఘాట్‌లో మలుపు వద్ద సాంకేతిక లోపంతో ఆగిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఆదివారం కర్రల లోడుతో గిద్దలూరు నుంచి నంద్యాల వైపు వస్తున్న లారీ దొరబావి వంతెన సమీపంలో ఇటుకల దిమ్మె వద్ద మలుపులో ఆగిపోయింది. అటూ ఇటూ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెద్ద వాహనాలన్నీ ఆగిపోయాయి. నాలుగు చక్ర వాహనాలు వెళ్లేందుకు కాస్త వీలు ఉండటంతో రాకపోకలు జరిగాయి. సమాచారం అందుకున్న మహానంది ఎస్సై రామ్మోహన్‌రెడ్డి తన సిబ్బందిని పంపి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. రోడ్ సేఫ్టీ పోలీసులు చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

# జనవరి నెల వరకు హంద్రీనీవా నీరు విడుదల అవుతుందా..?

-జీడీపీ కింది సాగు, తాగునీటి పథకాలకు నీరు



గాజులదిన్నె ప్రాజెక్టులో ఉన్న 2.7 టీఎంసీల నీరు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గాజులదిన్నె ప్రాజెక్టులో నీరు అనుకున్నంత ఆశాజనకంగా లేదు. ప్రస్తుతం 2.7 టీఎంసీ (గ్రాస్) నీరు ఉంది. ఈ నీరు ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతులు సాగు చేసిన పంటలకు పూర్తి గా అందుతుందనే నమ్మకం లేదు. ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రాజెక్ట్ కింద దాదాపు 13వేల ఎకరాలు సాగు అయినట్లు తెలుస్తుంది. పంటలు చేతికి అందేవరకు సాగు నీరు విడుదల చేయాల్సి వస్తుంది అంటే వచ్చే ఏడాది మర్చి నెల చివరి వరకు సాగు నీరు అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం జీడీపీలోకి హంద్రీనీవా పథకం నుంచి నీరు రోజుకు 100నుంచి 120 క్యూసెక్కుల నీరు వస్తుంది. ఎల్లెల్సీనీరు తగ్గిపోవడంతో జీడీపీకి నీటి విడుదలను ఎల్లెల్సీ అధికారులు నిలిపివేశారు. ఆయకట్టు భూములకు కుడి, ఎడమ కాలువల ద్వార ప్రతిరోజుకు 120 నుంచి 150 క్యూసెక్కుల నీరు పొలాలకు



జీడీపీ కాలువలకు నీరు విడుదల అవుతున్న దృశ్యం

విడుదల అవుతుంది. వచ్చే ఏడాది జనవరి నెల చివరి వరకు లేదా ఫిబ్రవరి మొదటి వారం వరకు హంద్రీనీవా నీరు రోజుకు 120 క్యూసెక్కుల నీరు గాజులదిన్నె ప్రాజెక్టుకు చేరితేనే ఇప్పుడు సాగు చేసిన 13వేల ఎకరాలకు మార్చి నెల చివరి వరకు నీరు విడుదల చేసి ప్రాజెక్ట్ కింద ఉన్న తాగునీటి పథకాలకు నీరు అందించవచ్చు లేదంటే ఇక వేసవిలో తాగునీటి పథకాలకు, సాగునీటి కి కూడా ఇబ్బంది తప్పదని ప్రాజెక్ట్ ఇరిగేషన్ అధికారుల లెక్కలు వేసుకుంటున్నట్లు తెలుస్తుంది. శ్రీశైలం బ్యాంక్ వాటర్ రోజురోజుకు తగ్గుతున్నట్లు తెలుస్తుంది. ఆ నీరు తగ్గితే హంద్రీనీవా ద్వార జీడీపీకి వచ్చే నీరు నిలిచిపోతుంది. ప్రస్తుతం అందున్న సమాచారం వే రకు జనవరి నెల మొదటి వారం వరకు మాత్రమే జీడీపీకి నీరు వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. జీడీపీ కింద బండగట్టు, డోన్, క్రిష్ణగిరి, కోడుమూడు కర్నూలు, గూడుర , బెళగల్, తాగునీటి పథకాలు ఉన్నాయి. దీంతో పాటు హంద్రీపరిసర గ్రామాలకు రింగ్ బోర్ల ద్వార తాగునీరు అందుతుంది.

# రాహుల్ గాంధీ తక్షణమే క్షమాపణలు చెప్పాలి



**కర్నూలు మేజర్ న్యూస్ ప్రతినిధి :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడమే కాక పార్లమెంటులో బిజెపి ఎంపీలపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తక్షణమే బిజెపికి క్షమాపణలు చెప్పాలని బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, అధికార ప్రతినిధి పిటి సాయి ప్రదీప్ లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద బిజెపి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్లో అమిత్ షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను ఒక దేవుడితో పోల్చడం జరిగిందని దీని వక్రీకరించి రాహుల్ గాంధీ రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని విమర్శించారు. బిజెపి పార్లమెంట్ సభ్యుడిపై రాహుల్ గాంధీ దాడి చేయడం జరిగిందని యావత్ దేశ ప్రజలు వీక్షించారనిఅన్నారు. అంబేద్కర్ను గౌరవించిన పార్టీ అంబేద్కర్ రెండు పర్యాయాలు ఓడించింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. అనంతరం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను చేసేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నించగా అడ్డుకున్నారు. దీంతో తోపులాట చోటు చేసుకుంది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాశీ విశ్వనాథ్, వేల్పుల గోపాల్, రామాంజనేయులు, మధు గౌడ్, మహిళా మోర్చా నాయకురాలు గొందిపల్లి మాలతీ, శ్రీనివాసులు, నవీన్ కుమార్, శ్రీరాములు, హవిలన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల మల్లన్న దంపతులకు వైభవంగా పల్లకీ ఉత్సవం

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** లోక కల్యాణం కోసం శ్రీశైల దేవస్థానంలో ఆదివారం రాత్రి శ్రీస్వామి అమ్మవార్లకు పల్లకీఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చక స్వాములు సేవా సంకల్పాన్ని పఠించి తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతిపూజ జరిపించారు. అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబుచేయించిశాస్త్రోక్తంగా షోడశోపచారపూజలుజరిపించిఆతరువాతపల్లకీఉత్సవాన్ని నిర్వహించారు.

**మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ :** శ్రీశైల మల్లన్న ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. భక్తులు వేకువజామున నుంచే పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనార్థమే ఆలయ క్యూలైన్లలో బారులు తీరారు. దీంతో ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర క్యూ లైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది.

**భక్తులను అలరించిన సంప్రదాయ నృత్యప్రదర్శన :**

ధర్మపథంలో భాగంగా శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న వివిధ సాం



పల్లకీలో కొలువుతీరిన శ్రీ స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులు

స్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరిస్తున్నాయి. ధర్మపథంలో భాగంగా ఆలయ దక్షిణ మాడ వీధుల్లోని నిత్య కళారాధన వేదిక వద్ద దేవస్థానం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ప్రతిరోజు కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ,సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం,భక్తిరంజని లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

# ఇంటింటా భగవద్గీత ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః** శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు ఆశిస్సులతో ఆదివారం భవగద్గీత ప్రచారం నిర్వహించడం జరిగింది. ప్రచారంలో ఇందూ జ్ఞానవేదిక ప్రబోధాసేవా సమితి సభ్యులు కొలిమిగుండ్ల మరియు సంజామలలో ఇంటింటా భగవద్గీత గ్రంథ ప్రచారం చేశారు. అందులో భాగంగా కొలిమిగుండ్ల, సంజామల గ్రామ ప్రజలు మా ఊరిలో భగవద్గీత ప్రచారం నిర్వహించడం మాకు ఎంతో సంతోషంగా ఉందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. అదే విధంగా ప్రతి ఊరిలో ఈ త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రచారం నిర్వహించాలని పెద్దలు తెలిపారు. ఎందుకంటే ముందుగా మేము భగవద్గీత చదివాము కానీ మా కు ఆ గ్రంథాలు సరిగా అర్థం కావడం లేదు కానీ ప్రబోధానంద స్వామి వారు వ్రాసిన త్రైత సిద్ధాంత భగవద్గీత రెండవ తరగతి చదివే ప్రతి పిల్లవానికి అర్థమయ్యే రీతిలో ఉందని ఇది మనం అదరం గర్వింపదగ్గ విషయం అని వారు అభినందనలు తెలిపారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలి భగవద్గీత సర్వ మానవులకు సంబంధించిన గ్రంథము ఇది ఒక మత గ్రంథం కాదు అని వారు సంతోషం వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు తప్పనిసరి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, రోటరీ క్లబ్ సభ్యులు

**ఆదోని, మేజర్ న్యూస్ :** విద్యార్థినీ విద్యార్థులు చదువుతోపాటు క్రీడాపోటీల్లో తప్పనిసరిగా పాల్గొన్నాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పేర్కొన్నారు. ఆదివారం సైన్స్ కళాశాల మైదానంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో న్యూ జనరేషన్ ఆక్టివిటీస్ 2024-25 యాన్యువల్ జోనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పార్థసారథి, రోటరీ క్లబ్ మాజీ డిస్టిక్ గవర్నర్ చిన్నప్పరెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ దశరథ రామిరెడ్డి, అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ సునీల్‌రెడ్డిలు పాల్గొని జ్యోతి ప్రజల్వన చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే, రోటరీ క్లబ్ అధ్యక్షుడు, యూత్ అధికారి సాబీర్ అహ్మద్ కాగడను చేత పట్టుకొని గ్రౌండ్‌లో ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న నైపున్యాన్ని వెలికి తీసేందుకు క్రీడా పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, యూత్ అధికారి రాజేష్‌జైన్, సభ్యులు శ్రీధర్ రెడ్డి, భరత్‌షా, ప్రశాంత్ గాంధీ, సుబ్బయ్య, బసవరాజు, వీరేష్ స్వామి, పద్మనాభయ్య శెట్టి, శేషయ్య, నితిన్, శివరాం, హుసేన్, బాష తదితరులు పాల్గొన్నారు.

## దాదాపీర్ సాహెబ్ దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక ఫాతేహాలు

**ఆదోని, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఇస్వీ క్రాస్‌లో వెలసిన సయ్యద్ దాదాపీర్ సాహెబ్ దర్గాలో దర్గా పీఠాధిపతి సయ్యద్ షా బాషాపీర్ సాహెబ్ ఖాదర్ లింగ్ బంద్ జగద్గురు జాగీర్దార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వాల్మీకి డాక్టర్ పార్థసారథికి దర్గా పీఠాధిపతి బృందంతోపాటు భక్తులు స్వాగతం పలికారు. ఆదివారం కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్‌లో వెలసిన హజ్రత్ సయ్యద్ ఖురానుద్దీన్ జానః ఉరుసు వేడుకలు దర్గాలో పీఠాధిపతిఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ ఉరుసు వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. అనంతరం దర్గాకు విచ్చేసిన భక్తాదులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. దర్గాలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో దర్గా కిటకిటలాడింది.



# నేడు కాలభైరవాష్టమి ఘనంగా ఏర్పాట్లు

-కాళభైరవ, కాళికామాత కళ్యాణంనకు ప్రత్యేక ఏర్పాట్లు

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** మండలంలోని చిన్న కందుకూరు గ్రామసమీపంలో వెలసిన సోములకాలభైరవస్వామి సమేత కాళికా మాత సహిత సోమేశ్వర స్వాముల దేవాలయ సముదాయంలో ఈనెల 23న కాలభైరవాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ ఆదివారం తెలిపింది. ఇందులో భాగంగా స్వాములకు ప్రత్యేకాభిషేకార్చనలు నిర్వహిస్తున్నామన్నారు. కాలభైరవస్వామి, కాళికా మాతల కళ్యాణాన్ని. 'నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హాజరైన భక్తులందరికి అన్నప్రసాద వితరణ చేస్తున్నామన్నారు. భక్తులు ఈ వేడుకల్లో పాల్గోని కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఆలయ కమిటీ వారు పిలుపునిచ్చారు.

